


# ఫ్లైఓవర్ పరేషాన్ ఉండదిక!

## ఇరుకు రోడ్ల లొల్లికి చెల్లు గూగుల్ మ్యాప్స్‌లో సరికొత్త ఫీచర్లు

హైదరాబాద్, జూలై 25: గూగుల్ మ్యాప్స్‌ను నమ్ముకుంటే గల్లీల్లో ఇరుక్కుపోయాం. ఫ్లైఓవర్‌పై నుంచి రావాలని తెలియక కింద నుంచి వెళ్లి సిగ్నల్ దగ్గర ట్రాఫిక్‌లో చిక్కుకున్నాం. గూగుల్ మ్యాప్స్ వినియోగించే చాలామంది ఇలాంటి అనుభవాలను చెప్తుంటారు. ఈ సమస్యలకు ఇప్పుడు గూగుల్ పరిష్కారాలను తీసుకువచ్చింది. భారత్‌లో గూగుల్ మ్యాప్స్‌కు ఆరు సరికొత్త ఫీచర్లను జోడించింది. ఈ ఫీచర్ల ద్వారా వినియోగదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గమ్యం చేరుకోవచ్చని గూగుల్ చెప్తున్నది. ఈ వారం నుంచి ఈ ఫీచర్లు అందుబాటులోకి వస్తున్నాయి.



### 'న్యారో రోడ్'

గూగుల్ కొత్తగా 'న్యారో రోడ్' ఫీచర్‌ను తీసుకొచ్చింది. శాటిలైట్ చిత్రాలు, స్ట్రీట్ వ్యూ, ఇతర డాటా ద్వారా కృత్రిమ మేధ(ఏఐ) ఇరుకు రోడ్లను గుర్తిస్తుంది. మ్యాప్స్‌లో దారి చూపించేటప్పుడు 'న్యారో రోడ్' అని సూచిస్తుంది. తద్వారా వాహనదారులు ఆ రోడ్డును వదిలి మరో మార్గంలో వెళ్లే అవకాశం ఉంటుంది. ప్రస్తుతానికి ఈ ఫీచర్‌ను హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై వంటి ఎనిమిది నగరాల్లో తీసుకువచ్చింది.



### 'టేక్ ఫ్లైఓవర్'

గూగుల్ మ్యాప్స్‌లో అడ్రస్ పెట్టుకొని మనం వెళ్లే రోడ్డులో ఫ్లైఓవర్ వచ్చినప్పుడు దాని మీద నుంచి వెళ్లాలా, కింది నుంచి వెళ్లాలా అనేది చాలా పెద్ద గందరగోళంగా ఉంటుంది. ఈ సమస్యను గూగుల్ కొత్త ఫీచర్ పరిష్కరించింది. ఇప్పుడు మ్యాప్స్‌లో ఫ్లైఓవర్లు ప్రత్యేకంగా కనిపిస్తాయి. ఫ్లైఓవర్ నుంచి వెళ్లాల్సి ఉంటే 'టేక్ ఫ్లైఓవర్' అనే సూచన కనిపిస్తుంది. ఈ ఫీచర్ దేశంలోని 40 ప్రధాన నగరాల్లో అందుబాటులోకి వచ్చింది.



### మ్యాప్స్ నుంచి మెట్రో టికెట్స్

గూగుల్ మ్యాప్స్‌లో మెట్రో రైలు రూట్ మాత్రమే కాదు మెట్రో టికెట్లు కూడా బుక్ చేసుకోవచ్చు. ఇందుకోసం మ్యాప్స్‌లో కొత్త ఫీచర్ అందుబాటులోకి వచ్చింది. ఓఎన్‌డీసీ, నమ్మ యాత్రి సంస్థలతో కలిసి గూగుల్ ఈ ఫీచర్‌ను తీసుకొచ్చింది. అయితే, ఇప్పటివరకైతే ఇది కొచ్చి, చెన్నై మెట్రోలకు మాత్రమే అందుబాటులో ఉంది. భవిష్యత్తులో మిగతా నగరాల్లోనూ అందుబాటులోకి రానున్నది.

### ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఈజీగా గుర్తించొచ్చు

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో మ్యాప్స్‌లో గూగుల్ కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దాదాపు 8,000 ఈవీ చార్జింగ్ స్టేషన్లను మ్యాప్స్‌తో అనుసంధానం చేసింది. ఈవీ వినియోగదారులు మ్యాప్స్‌లో చార్జింగ్ స్టేషన్లను గుర్తించొచ్చు. ఏ చార్జింగ్ స్టేషన్‌లో ఎలాంటి చార్జర్ ఉందో కూడా తెలుసుకోవచ్చు. ఇప్పటివరకు భారత్‌లో మాత్రమే ఇలా ద్విచక్ర వాహనాల ఈవీ చార్జింగ్ స్టేషన్లు సైతం మ్యాప్స్‌తో అనుసంధానం అయ్యాయి.

### ఎక్కడికెళ్లాలి? ఏం చూడాలి?

ఏదైనా కొత్త నగరానికి వెళ్లినప్పుడు పర్యాటకులు గూగుల్ మ్యాప్స్‌పై ఎక్కువగా ఆధారపడతారు. అయితే, ఆ ప్రాంతంలో చూడాల్సిన ప్రదేశాలు తెలుసుకోవడానికి ఇతరులను అడగడమో, ఇంటర్నెట్‌లో సెర్చ్ చేయడమో తప్పేది కాదు. ఇక, నుంచి గూగుల్ మ్యాప్స్‌లోనే ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రముఖ ప్రదేశాలు, టూరిస్ట్ స్పాట్‌లు తెలిసిపోతాయి. పది నగరాల్లో స్థానిక నిపుణులతో జాబితాలు సిద్ధం చేసి మ్యాప్స్‌లో పొందుపరిచింది.

### రోడ్డుపై సమస్య చెప్పొచ్చు

మనం ప్రయాణించే రోడ్డుపై ఏదైనా సమస్య ఉన్నా, రోడ్డు ప్రమాదం జరిగినా, రోడ్డు మూసి ఉన్నా, వాహనం నిలిచిపోయినా, వాహనాలు ఆలస్యంగా కదులుతున్నా మ్యాప్స్‌లో రిపోర్ట్ చేసేందుకు 'రిపోర్ట్ యాన్ ఇన్సిడెంట్' అనే ఫీచర్‌ను గూగుల్ ప్రవేశపెట్టింది. వీటి ప్రకారం ఆ రోడ్డులో రియల్-టైమ్ ట్రాఫిక్ పరిస్థితులను ఇతర వినియోగదారులకు గూగుల్ తెలియజేస్తుంది.

## సీయూఈటీ-యూజీ ఫైనల్ కీ విడుదల

న్యూఢిల్లీ, జూలై 25: 'సీయూఈటీ-యూజీ-2024' ప్రవేశ పరీక్షల తుది సమాధానాల కీ గురువారం విడుదలైంది. ప్రవేశ పరీక్ష ఫలితాల్ని త్వరలో విడుదల చేస్తామని గురువారం ఎన్‌టీఏ తెలిపింది. నీట్-యూజీ, యూజీసీ-నెట్ సహా సీయూఈటీ-యూజీ ప్రవేశ పరీక్షలోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు వచ్చాయని, దీంతో ఫలితాల విడుదల ఆలస్యమైందని ఎన్‌టీఏ అధికారి ఒకరు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జూన్ 30న పరీక్ష ఫలితాల్ని ఎన్‌టీఏ విడుదల చేయాల్సింది. అలాంటిది జూలై 7న తాత్కాలిక జవాబుల కీని విడుదల చేసింది. జూలై 19న 1000 మందికి పైగా అభ్యర్థులకు రీటెస్ట్ నిర్వహించింది.

## అలా చేస్తే సీబీఐ, ఈడీ దర్యాప్తు ఆపేస్తాం!

- ఠాక్రే, ఎంవీఏ నేతలపై తప్పుడు అఫిడవిట్లు ఫైల్ చేయాలని ఒత్తిడి
- ఫడ్నవీస్‌పై మహారాష్ట్ర మాజీ హోంమంత్రి అనిల్ దేశ్‌ముఖ్ సంచలన ఆరోపణలు




అనిల్ | ఫడ్నవీస్

ముంబై, జూలై 25: మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్‌పై రాష్ట్ర మాజీ హోంమంత్రి అనిల్ దేశ్‌ముఖ్ సంచలన ఆరోపణలు చేశారు. మూడేండ్ల క్రితం రాష్ట్రంలోని మహావికాస్ అఘాడీ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ఆయన కుట్రలు చేశారని ఆరోపించారు. అందులో భాగంగా అప్పటి సీఎం, శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే, ఇతర ఎంవీకే కూటమి నేతలకు వ్యతిరేకంగా తప్పుడు అఫిడవిట్లు ఫైల్ చేయాలని తనపై ఒత్తిడి చేశారని, ఈ మేరకు ఫడ్నవీస్ తనతో పలుమార్లు ఫోన్లో మాట్లాడారని, ఆయన మనిషి ద్వారా రాయబారం నడిపారని పేర్కొన్నారు. అలా చేస్తే 'రిటర్న్ గిఫ్ట్'గా తనపై సీబీఐ, ఈడీ కేసుల దర్యాప్తులను నిలిపివేయిస్తామని ఫడ్నవీస్ ఆఫర్ ఇచ్చారని దేశ్‌ముఖ్ అన్నారు. తాను తిరస్కరించినందుకు తనపైకి సీబీఐ, ఈడీలను పంపించారని, 13 నెలల పాటు జైల్లో పెట్టారని ఎన్సీపీ(శరద్ పవార్) నేత అనిల్ దేశ్‌ముఖ్ పేర్కొన్నారు. దేశ్‌ముఖ్ ఆరోపణలు నిరాధారమైనవని ఫడ్నవీస్ అన్నారు. ఉద్ధవ్, శరద్ పవార్‌లకు వ్యతిరేకంగా ఆయన చేసిన వ్యాఖ్యల ఆడియో, వీడియో క్లిప్పులు తన వద్ద ఉన్నాయని అన్నారు. ఫడ్నవీస్‌కు కౌంటర్ ఇస్తూ.. తనకు వ్యతిరేకంగా వీడియో క్లిప్పులను బయటపెట్టాలని అనిల్ సవాల్ చేశారు.

# పరీక్షల ప్రక్రియలో మార్పులు!

**అక్రమాల అడ్డుకట్టకు సాంకేతికత**

- ఫింగర్‌ప్రింట్ అథెంటికేషన్, ఫేషియల్ రికగ్నిషన్ వినియోగం
- నీట్, పూజా ఖేద్కర్ వివాదాల నేపథ్యంలో యూపీఎస్సీ నిర్ణయం



న్యూఢిల్లీ, జూలై 25: నీట్-యూజీ పరీక్షలో అక్రమాల ఆరోపణలు, ఐఏఎస్‌గా పూజా ఖేద్కర్ నియామకంపై వివాదం నేపథ్యంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) పరీక్షల ప్రక్రియలో మార్పులకు సిద్ధమైంది. అధునాతన సాంకేతికతను వినియోగించి అక్రమాలకు తావులేకుండా చూడాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆధార్ ఆధారంగా వేలిముద్రల ధ్రువీకరణ, ముఖాన్ని గుర్తించే ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ సాంకేతికను పొందేందుకు గానూ ప్రభుత్వ రంగ సంస్థల(పీఎస్‌యూ) నుంచి టెండర్లను ఆహ్వానించింది. అభ్యర్థుల బయోమెట్రిక్‌ను ధ్రువీకరించేందుకు, పరీక్ష సమయంలో అభ్యర్థుల కార్యకలాపాలను పర్యవేక్షించడం ద్వారా మోసాలు, ఒకరికి బదులుగా మరొకరు పరీక్షకు హాజరుకావడం వంటి అక్రమాలను అడ్డుకునేందుకు అధునాతన సాంకేతికతను వినియోగించాలని నిర్ణయించినట్టు టెండర్ డాక్యుమెంట్‌లో యూపీఎస్సీ పేర్కొన్నది.

**వారం ముందు అభ్యర్థుల వివరాలు**

ఈ సాంకేతికతను అందించే ప్రభుత్వ రంగ సంస్థకు పరీక్ష తేదీకి రెండు మూడు వారాల ముందు ఏర్పాట్లు చేసుకునేందుకు పరీక్షా కేంద్రాల వివరాలు, హాజరయ్యే అభ్యర్థుల సంఖ్య వంటి ప్రాథమిక వివరాలు అందిస్తామని యూపీఎస్సీ తెలిపింది. వేలిముద్రతో ధ్రువీకరణ, ఫేషియల్ రికగ్నిషన్ కోసం అభ్యర్థుల పేర్లు, హాల్ టికెట్ నెంబరు, ఫొటో వంటి వివరాలను మాత్రం వారం రోజుల ముందు ఇస్తామని తెలిపింది. సివిల్ సర్వీసుల పరీక్షలతో పాటు ప్రతియేటా 14 రకాల పరీక్షలను యూపీఎస్సీ నిర్వహిస్తున్నది. ట్రెయినీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ అక్రమంగా ఉద్యోగం పొందిందనే అంశం బయటకు రావడం, ఐదేళ్ల పదవీకాలం ఉండగానే యూపీఎస్సీ చైర్మన్ మనోజ్ సోని రాజీనామా వంటి అంశాలు వివాదంగా మారిన సంగతి తెలిసిందే.

## నీట్ రివైజ్డ్ ఫలితాలు విడుదల కాలేదు

### కేంద్ర విద్యా శాఖ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూలై 25: సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) నీట్ యూజీ-2024 రివైజ్డ్ ఫలితాలను విడుదల చేసిందని వచ్చిన వార్తలను కేంద్ర ప్రభుత్వం గురువారం ఖండించింది. సవరణ పలితాలను ఇంకా విడుదల చేయలేదని స్పష్టం చేసింది. షేర్ అవుతున్న లింక్ పాతదని, త్వరలో అభ్యర్థుల తుది మార్కులను విడుదల చేస్తామని కేంద్ర విద్యా శాఖ తెలిపింది. నీట్ యూజీ పరీక్షలో ఫిజిక్స్‌లో అడిగిన ఓ ప్రశ్నకు రెండు సమాధానాలు ఉన్నాయన్న అంశం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఢిల్లీ ఐఐటీ నిపుణుల బృందం సంబంధిత ప్రశ్నకు 'ఆప్షన్ 4' సరైన సమాధానం అని తేల్చింది. దీంతో సవరించిన ఫలితాలను విడుదల చేయాలని సర్వోన్నత న్యాయస్థానం తాజాగా ఎన్టీఏకు ఆదేశాలు జారీచేసింది.

## స్కూల్ సర్టిఫికెట్లలో మత మార్పిడికి అనుమతి

### కేరళ హైకోర్టు కీలక తీర్పు

కొచ్చి: ఇద్దరు యువకులు తమ పాఠశాల ధ్రువీకరణ పత్రాల్లో మతం మార్చుకోవడానికి కేరళ హైకోర్టు అనుమతి ఇస్తూ కీలక తీర్పు ఇచ్చింది. ఈ మేరకు పరీక్షల నియంత్రణాధికారి పిటిషన్‌ను తిరస్కరించింది. అధికారులు సర్టిఫికెట్లలో మత మార్పిడికి తిరస్కరించడంతో ఇద్దరు యువకులు హైకోర్టును ఆశ్రయించారు. స్కూల్ సర్టిఫికెట్లలో మత మార్పిడిని అనుమతించే నిబంధన ఏదీ లేనప్పటికీ.. కేవలం పుట్టుక కారణం వల్ల ఒక వ్యక్తిని ఒక మతానికి కట్టుబడి ఉండేలా చేయడం సబబు కాదని వ్యాఖ్యానించింది. రాజ్యాంగంలోని 25(1) అధికరణ ప్రకారం ప్రతి వ్యక్తికి మత స్వేచ్ఛ ఉందని తెలిపింది.

## భారత్‌లో నాసిరకం దగ్గుమందులు

### నాణ్యత పరీక్షలో 100కు పైగా సిరప్‌లు విఫలం

న్యూఢిల్లీ: భారతీయ ఫార్మా కంపెనీలకు చెందిన 100కు పైగా దగ్గు సిరప్‌లు నాణ్యత పరీక్షలో ఫెయిల్ అయ్యాయని ప్రభుత్వ నివేదిక ఒకటి వెల్లడించింది. ఈ దగ్గు మందుల్లోని కొన్ని శాంపిళ్లలో డైథిలిన్ గ్లైకాల్(డీఈజీ), ఇథిలిన్ గ్లైకాల్(ఈజీ) వంటి విష పదార్థాలు ఉన్నాయని తేలింది. డీఈజీ, ఈజీ, అస్సే, మైక్రోబియాల్ గ్రోత్, పీహెచ్, వాల్యూమ్ వంటి అంశాల కారణంగా ఆయా సిరప్‌ల బ్యాచ్‌లను నాణ్యతా ప్రమాణాలు లేని వాటిగా తేల్చారు. ప్రపంచవ్యాప్తంగా 141 మంది చిన్నారుల మరణాలకు భారత్‌లో ఉత్పత్తి అయిన దగ్గు మందులే కారణమని ఆరోపణలు రావడంతో..ప్రభుత్వ, ప్రైవేటు ల్యాబ్‌లు దేశవ్యాప్తంగా టెస్టింగ్‌లు చేపట్టాయి.

## దర్బార్ హాల్, అశోక్ హాల్ పేర్లు మార్పు

న్యూఢిల్లీ: గురువారం రాష్ట్రపతి భవన్‌లోని రెండు హాళ్ల పేర్లను మార్చారు. దర్బార్ హాల్‌ను 'గణతంత్ర మండపం'గా, అశోక హాల్‌ను 'అశోక మండపం'గా నామకరణం చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి సెక్రటేరియట్ తెలిపింది. రాష్ట్రపతి భవన్ వాతావరణాన్ని భారతీయ సాంస్కృతిక విలువలు, తత్వాలను ప్రతిబింబించేలా చేసే ప్రయత్నమే ఇదని వివరించింది. దర్బార్ హాల్‌ను జాతీయ అవార్డులు ప్రదానం చేసేందుకు, ముఖ్యమైన వేడుకలు నిర్వహించేందుకు ఉపయోగిస్తుండగా, అశోక హాల్ ఓ బాల్‌రూమ్.

**కేజ్రీవాల్ ఆరోగ్యంపై ఆందోళన..**

## 30న ఇండియా కూటమి నిరసన

న్యూఢిల్లీ, జూలై 25: తీహార్ జైల్లో ఉన్న ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆరోగ్యం క్షీణిస్తున్న విషయాన్ని లేవనెత్తేందుకు ఈనెల 30న విపక్ష ఇండియా కూటమి పార్టీలు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ర్యాలీ చేపట్టనున్నట్టు ఆమ్ ఆద్మీ పార్టీ గురువారం వెల్లడించింది. మద్యం పాలసీ కేసులో అరెస్టు అయిన కేజ్రీవాల్‌ను జైల్లోనే చంపేందుకు కేంద్రంలోని అధికార బీజేపీ కుట్ర చేసిందని ఆప్ ఆరోపిస్తున్నది. జూన్ 3, జూలై 7 మధ్య ఆయన షుగర్ స్థాయిలు పలుమార్లు పడిపోయాయన్న వైద్య నివేదికను ఆ పార్టీ ప్రస్తావిస్తున్నది.

## నార్త్ బెంగాల్‌పై దుమారం

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్ ఉత్తర ప్రాంతానికి ఈశాన్య రాష్ట్రాలతో సారూప్యతలు ఉన్నాయని, దాన్ని ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కిందకు తీసుకురావాలని తాను ప్రధాని మోదీకి ప్రతిపాదన చేశానన్న కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ చేసిన వ్యాఖ్యలపై టీఎంసీ మండిపడింది. బెంగాల్‌ను విభజించలేరని తృణమూల్ నేత సుదీప్ బందోపాధ్యాయ్ అన్నారు. గతంలో గోర్ఖాలాండ్ డిమాండ్‌ను పశ్చిమబెంగాల్ ప్రజలు వ్యతిరేకించారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ఇలాంటి డిమాండ్లను సహించరని, వాళ్లు(బీజేపీ నేతలు) ఇదే విధంగా మాట్లాడితే బీజేపీ రాష్ట్రంలో జీరో అవుతుందన్నారు.



పుణెలో వరదలో చిక్కుకున్న స్థానికులను తరలిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది

# మహారాష్ట్రలో భారీ వర్షాలు

- వరద ముంపులో ముంబై, పుణె
- విమాన సర్వీసులకు అంతరాయం
- విద్యాసంస్థలకు సెలవులు
- రెండు నగరాల్లోనూ రెడ్ అలర్ట్

ముంబై, జూలై 25: భారీ వర్షాలతో మహారాష్ట్ర అతలాకుతలం అవుతున్నది. గురువారం ముంబైలో తెల్లవారు జామున 4 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 100 మి.మీ. పైగా వర్షపాతం నమోదయ్యింది. పలు ప్రాంతాల్లో 150 మి.మీ. పైగా వర్షం కురిసింది. ముంబైతో పాటు పుణె, థాణే, పాల్ఘార్ సహా పలు నగరాలను వరద ముంచెత్తింది. దీంతో ముంబైలోని స్కూళ్లు, కళాశాలలకు గురువారం సెలవు ప్రకటించారు. వర్షాల కారణంగా రాష్ట్రంలో ఆరుగురు మరణించారు. వీరిలో ముగ్గురు డెక్కన్ ప్రాంతంలో విద్యుదాఘాతంతో మృతి చెందారు. పింప్రి-చించ్వాడ్ ప్రాంతంలో వరద పోటెత్తింది. దీంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఆర్మీ రంగంలోకి దిగింది. పుణెకు 65 కిలోమీటర్ల దూరంలో ఉన్న లవాసా ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడ్డాయి. వర్షాలు, వరద కారణంగా ముంబై, పుణెలో ప్రజా రవాణా స్తంభించిపోయింది. ముంబైలో భారీ వర్షాల కారణంగా పలు విమానాలు రద్దయ్యాయని, ఇంకొన్ని విమానాలను మళ్లించినట్టు ఎయిర్ ఇండియా ప్రకటించింది. కాగా, మహారాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ముంబై, పుణెలో రెడ్ అలర్ట్ జారీ చేసింది.

# ఖనిజాలపై పన్ను అధికారం రాష్ట్రాలదే

- పార్లమెంటుకు ఆ హక్కు ఉండదు
- పరిమితులు మాత్రం విధించవచ్చు
- రాష్ట్రాలకు ఇచ్చే రాయల్టీ.. పన్ను కాదు
- సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు



న్యూఢిల్లీ, జూలై 25: ఖనిజాలపై పన్ను విధించే చట్టబద్ధమైన అధికారం రాష్ట్రాల చట్టసభలకు ఉంటుందని, పార్లమెంటుకు ఈ అధికారం ఉండదని సుప్రీంకోర్టు చారిత్రక తీర్పును ఇచ్చింది. రాష్ట్రాలకు దక్కే రాయల్టీ అనేది పన్ను కాదని కోర్టు స్పష్టం చేసింది. కేంద్రం, రాష్ట్రాల మధ్య వివాదంగా ఉన్న ఈ అంశంపై గురువారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 8:1 మెజారిటీతో తీర్పు వెలువరించింది. రాజ్యాంగంలోని మొదటి జాబితా 54వ ఎంట్రీ ప్రకారం ఖనిజాలపై పన్ను విధించే చట్టబద్ధమైన అధికారం పార్లమెంటుకు ఉండదని ధర్మాసనం పేర్కొన్నది. అయితే, రెండో జాబితాలోని 50వ ఎంట్రీ ప్రకారం మాత్రం.. రాష్ట్రాలపై పరిమితులు, షరతులు, మార్గదర్శకాలతో పాటు నిషేధం కూడా విధించే అధికారం పార్లమెంటుకు ఉందని పేర్కొన్నది. ఖనిజాలపై ప్రాథమిక అధికారం కేంద్రానికి ఉంటుందని 1989లో ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన తీర్పును కొట్టివేసింది.

**కేంద్రం తిరిగిచ్చేలా ఆదేశించండి: రాష్ట్రాల వినతి**

గనులు, ఖనిజాలపై రాష్ట్రాలకు దక్కే రాయల్టీ అనేది పన్ను కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. లీజు పొందిన వ్యక్తి ఖనిజాలపై హక్కులను అనుభవిస్తున్నందుకు ఒక ఒప్పందం ప్రకారం చెల్లించేదే రాయల్టీ అని పేర్కొన్నది. కాగా, గతానికి కూడా వర్తించేలా ఈ తీర్పు అమలయ్యేలా చూడాలని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఖనిజాలు, గనులపై పన్నుల రూపంలో వసూలు చేసిన వేల కోట్ల రూపాయలను రాష్ట్రాలకు తిరిగి ఇచ్చేలా నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనాన్ని రాష్ట్రాలు కోరాయి. రాష్ట్రాల విజ్ఞప్తిని కేంద్రం తరపున విచారణకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వ్యతిరేకించారు. ఇలా చేస్తే భారీ ప్రభావం పడుతుందని, ఇక నుంచి మాత్రమే తీర్పు అమలయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని ధర్మాసనాన్ని కోరారు. దీంతో ఈ విషయమై రాతపూర్వకంగా స్పందన తెలియజేయాల్సిందిగా కేంద్ర, రాష్ట్రాలకు సూచిస్తూ జూలై 31 వరకు కోర్టు గడువిచ్చింది. కాగా, జస్టిస్ బీవై నాగరత్న మాత్రం మిగతా న్యాయమూర్తుల అభిప్రాయంతో విభేదించారు.

### 35 ఏండ్ల వివాదం కొలిక్కి

ఖనిజ వనరుల మీద వచ్చే ఆదాయంపై కేంద్రం, రాష్ట్రాల మధ్య 35 ఏండ్లుగా ఉన్న వివాదానికి సుప్రీంకోర్టు ఈ తీర్పుతో ముగింపు పలికింది. రాయల్టీని కూడా పన్ను కిందనే చూడాలని, మైన్స్, మినరల్స్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్ ప్రకారం ఖనిజాలపై పన్నులు విధించే అధికారం రాష్ట్ర చట్టసభలకు ఉండదని 1989లో సుప్రీం కోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చింది. 2004లో మాత్రం ఐదుగురు సభ్యుల సుప్రీం ధర్మాసనం.. రాయల్టీ అనేది పన్ను కాదని మరో తీర్పు ఇచ్చింది. దీంతో ఈ అంశంపై రాజ్యాంగ ధర్మాసనం గురువారం ఇచ్చిన తీర్పు కీలకంగా మారింది.

## మిత్రపక్షాలకు 'ప్రేమ లేఖ'లా బడ్జెట్

### ఎన్డీయే ప్రభుత్వంపై విపక్షాల ఫైర్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులపై విపక్ష పార్టీల విమర్శల దాడి కొనసాగింది. బడ్జెట్‌పై చర్చలో భాగంగా గురువారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్ మాట్లాడుతూ 2024-25 బడ్జెట్‌ను చూస్తుంటే ఎన్డీయేలోని మిత్రపక్ష పార్టీలకు బీజేపీ రాసిన కృతజ్ఞత లేఖ, ప్రేమ లేఖగా అనిపిస్తున్నదని అన్నారు. ప్రభుత్వాన్ని కాపాడుకొనేందుకు ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది అని ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ ఎద్దేవా చేశారు. అటు రాజ్యసభలో ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా మాట్లాడుతూ పాత ప్రాపర్టీల అమ్మకాలపై ఇండెక్సేషన్ లబ్ధిని తొలగించాలన్న కేంద్రం నిర్ణయం వల్ల రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఎన్నికైన ఎంపీ జైల్లో ఉండటమూ ఎమర్జెన్సీనే

### అమృత్‌పాల్‌కు కాంగ్రెస్ ఎంపీ చన్నీ మద్దతు

న్యూఢిల్లీ: ఖలిస్థాన్ మద్దతుదారు, స్వతంత్ర ఎంపీ అమృత్‌పాల్ సింగ్ నిర్బంధంపై పంజాబ్ మాజీ సీఎం, కాంగ్రెస్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆయన పార్లమెంట్‌లో మాట్లాడుతూ 'వాళ్లు ప్రతిరోజూ అత్యవసర పరిస్థితి గురించి మాట్లాడతారు. కానీ ఇవాళ దేశంలో ఉన్న అప్రకటిత ఎమర్జెన్సీ గురించేమిటి? 20 లక్షల మంది పంజాబ్ ప్రజలు ఎన్నుకొన్న ఓ వ్యక్తిని జైల్లో ఉంచడం కూడా ఎమర్జెన్సీనే. తన నియోజకవర్గ ప్రజల అభిప్రాయాలను ఆయన ఇక్కడ వ్యక్తం చేయలేకపోతున్నారు. ఇదీ ఎమర్జెన్సీనే' అని ఆయన అన్నారు. దీనిపై బీజేపీ నేత గిరిరాజ్ సింగ్ స్పందిస్తూ.. కాంగ్రెస్ ఖలీస్థానీలకు మద్దతుగా నిలవడం దేశానికి ప్రమాదకరమని వ్యాఖ్యానించారు.

## ముఖంపై 'ఉదర క్యాన్సర్' లక్షణాలు!

న్యూఢిల్లీ, జూలై 25: ప్రపంచంలో ప్రమాదకరంగా మారుతున్న క్యాన్సర్‌లలో ఉదర క్యాన్సర్ ఒకటి. దీనిని గ్యాస్ట్రిక్ క్యాన్సర్ అని కూడా అంటారు. ప్రాణాంతకమైన ఈ వ్యాధి లక్షణాలను గుర్తించడం కూడా కష్టమే. సాధారణంగా ఉదర క్యాన్సర్ ప్రారంభంలో ఉండే లక్షణాలు అజీర్ణ సమస్యతో ఉండే లక్షణాలను పోలి ఉంటాయి. అయితే, ముఖంపై వచ్చే కొన్ని లక్షణాలను బట్టి ప్రారంభ దశలోనే ఉదర క్యాన్సర్‌ను గుర్తించవచ్చని నిపుణులు చెప్తున్నారు. ఉదర క్యాన్సర్ వల్ల పాపులోఎరిత్రోడెర్మ అనే అరుదైన చర్మ సంబంధ సమస్య వచ్చే అవకాశం ఉంటుందని, దీని వల్ల ముఖంపై చిన్న గడ్డలు ఏర్పడటం, వాపు రావడం జరగొచ్చని పేర్కొంటున్నారు. దీంతో పాటు చర్మం పొడిబారి ఊడిపోవడం, దురద వంటి లక్షణాలూ కనిపించవచ్చని చెప్తున్నారు. శోషరసగ్రంథుల వాపుతో పాటు ఆకలి కాకపోవడం, ఒకేసారి బరువు తగ్గడం, నిత్యం కడుపు నొప్పి ఉండటం, గుండెలో మంట, అజీర్ణం, వాంతులు, వికారం, హిమోగ్లొబిన్ లోపం వంటి లక్షణాలు ఉదర క్యాన్సర్ బాధితుల్లో ఉంటాయని పేర్కొంటున్నారు. ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని సూచిస్తున్నారు.

## భోజనంలో ఊరగాయ వేయనందుకు రూ.35 వేల ఫైన్!

చెన్నై, జూలై 25: అన్నంలోకి ఊరగాయ ఇవ్వలేదన్న కారణంతో తమిళనాడు వాసి ఒకరు ఒక హోటల్‌పై రెండేళ్లు వినియోగదారుల కమిషన్‌లో పోరాడి విజయం సాధించాడు. అన్నంలో ఊరగాయ వేయకపోవడం సేవల్లో లోపమని పేర్కొంటూ రెస్టారెంట్‌కు కమిషన్ రూ.35,025 జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే.. తమిళనాడు రాష్ట్రం విల్లుపురానికి చెందిన ఆరోగ్య స్వామి 25 భోజనాలు ఖరీదుచేశాడు. అయితే భోజనంలో ఊరగాయ లేకపోవడంతో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించి రెండేళ్ల పాటు పోరాడాడు. భోజనంలో ఊరగాయ మర్చిపోయినందుకు ఆ హోటల్ యజమానికి కమిషన్ 35 వేల జరిమానా విధించింది. అంతేకాకుండా ఖర్చుల కోసం 5 వేలు, ఊరగాయల ప్యాకెట్లకు మొత్తం రూ.25 ఇవ్వాలని ఆదేశించింది.



## రామాలయ వాచీ @ 34 లక్షలు

అయోధ్య రామమందిర థీమ్‌తో స్విట్జర్లాండ్ సంస్థ జాకోబ్ అండ్ కో లిమిటెడ్ ఎడిషన్ లగ్జరీ వాచ్‌ను తీసుకొచ్చింది. సమయం 6 గంటలైనప్పుడు ఈ గడియారం 'జై శ్రీరామ్' అని పలుకుతుంది, 9 గంటలు అయినపుడు రామాలయాన్ని చూపిస్తుంది. కాషాయ రంగు బెల్ట్, శ్రీరాముడు, హనుమంతుడు స్పష్టంగా కనిపించే విధంగా దీనిని తీర్చిదిద్దారు. మొత్తం 49 గడియారాలను తయారు చేశారు. ఒక వాచ్ ధర రూ.34 లక్షలు.



## టీచరమ్మగా రాష్ట్రపతి

న్యూఢిల్లీ : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం ఉపాధ్యాయురాలిగా మారారు. ఆమె రాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రెసిడెంట్స్ ఎస్టేట్‌లోని డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ కేంద్రీయ విద్యాలయాన్ని సందర్శించారు. ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదల, ఆ సమస్యను నిరోధించేందుకు చేపట్టవలసిన చర్యల గురించి తొమ్మిదో తరగతి విద్యార్థులకు బోధించారు. నీటి పరిరక్షణ అవసరాన్ని వివరించారు. వాతావరణ మార్పుల ప్రభావం తగ్గాలంటే మరిన్ని చెట్లను నాటాలని తెలిపారు.